# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**MARCH - 2019**

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

**P.O.BOX. 80, KAKINADA**

**PIN : 533004. Ph : 0884 - 2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 40 మార్చి - 2019 సంచిక -8


## విధేయతను గూర్చిన సత్యము

### ( The Truth about Obedience )

దేవుడు తన ప్రజల నుండి యెల్లప్పుడు విధేయతను కోరుచున్నారు. యేసుక్రీస్తు కుమారుడై యుండియు తాను పొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను. అందువలన తనకు విధేయులైన వారికందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:8-10). క్రీస్తు యేసు నందు లభించు సమస్త ఆత్మీయాశీర్వాదము లను మానవుడు పొందు నిమిత్తము మానవుని నుండి దేవుడేమి కోరుచున్నారో ఈ మాటలలో మనకు తెలియజేయ బడినది. ఈ సందర్భముగా విధేయతను గూర్చి మన ప్రభువే మనకొక గొప్ప మాదిరిగా చూపించబడెను. ఆయన తాను పొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను అని చెప్ప బడినది. దేవుని చిత్తమునకు సంపూర్తిగ లోబడుటయెట్లో ఫిలిప్పీయులకు అపో.పౌలు బోధించుచు యేసుప్రభువును మాదిరిగ వారికి చూపించెను. ఆయన మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందు నంతగా విధేయత చూపిన వాడై తన్ను తాను తగ్గించుకొనెను (ఫిలిప్పీ 2:8). గనుక విధేయతను మనము రెండు

విధములుగ గమనించ వచ్చును. 1) అది దేవుడు కోరుచున్నట్టిది 2) మన ముందు క్రీస్తు ఉంచిన మంచి మాదిరి అది. అందువలన దేవుని యొక్క వాక్యము మన నుండి సంపూర్ణ విధేయతను కోరుచున్నదని గమనింతము.

## విధేయతను రెట్టించెను

విధేయతను గూర్చి మనమ విపులముగ గ్రహించుకొను నిమిత్తము దేవుడు తన వాక్యములో రెట్టించి చెప్పెను. దేవుని సత్యమును బోధించు అనేక వచనములను గూర్చి మానవునికి సంశయము లేకుండ దేవుడెట్లు బోధించెనో అట్లే ఈ అంశమును గూర్చి కూడ ఆయన బోధించెను. యేసుప్రభువు విధేయతను గూర్చి పలుమారులు బోధించెను. ఆయన మత్తయి 7:21లో ఇట్లనెను : "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశించడు గాని పరలోకమందున్న నాతండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును". మరల లూకా 6:46లో ఆయన యిట్లనెను : "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?". "ప్రభువైన యేసు... పరలోకము నుండి అగ్ని జ్వాలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకులోబడని వారికిని ప్రతి దండన చేయును" అని థెస్సలోనికయులో యున్న సంఘమునకు అపో.పౌలు వ్రాసెను (2 థెస్స 1:6-8).

ఈ వచనములను బట్టి మనకొక సంగతి విశదమగుచున్నది : మానవులు దేవునికి విధేయత చూపించవలెను; లేని యెడల నాశన మొందవలెను. అందువలన సమస్తమైన అన్యజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు అనాది నుండి రహస్యముగా ఉంచబడిన మర్మము యిప్పుడు ప్రత్యక్ష పరచబడియున్నది (రోమా 16:25). సువార్త అందరికీ బోధింపబడవలెను. దాని ద్వారా అందరికీ విశ్వాసమునకు విధేయులయ్యే

తరుణము లభ్యమగును. అయితే సువార్త యిప్పుడు అందరికీ ప్రకటింప బడుచున్నను అందరు సువార్తకు లోబడుటలేదు (రోమా 10:16). సువార్తకు విధేయులు కాని వారి మీదికి దేవుని ప్రతిదండన తప్పక వచ్చును.

**సువార్తకు లోబడాలి**

మానవుడు యేసుక్రీస్తు సువార్తకు లోబడవలెనని దేవుడు యెంతగా కోరుచున్నారో ఈ వచనములను బట్టి మనము తెలిసికొనగలము. మనుష్యుని విధేయత వలననే దేవుని ఆశీర్వాదములు లభించును. అందువలన దేవుని యొక్క నానావిధమైన జ్ఞానము సంఘము ద్వారా తెలియబడ వలెనని ఆయన ఉద్దేశించెను (ఎఫెసీ 3:11). కాబట్టి యేసు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి; నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును, నమ్మనొల్లని వానికి శిక్ష విధించబడును అని తన శిష్యుల నాజ్ఞాపించెను (మార్కు 16:15,16). సువార్తయందే దేవుని ఆజ్ఞలు యిమిడి యున్నవి. ఆ ఆజ్ఞలకు మానవుడు విశ్వాసముతో విధేయత చూపవలెను. అంతేకాదు అతడు జీవించునంత కాలము విశ్వాసమునకు విధేయత చూపుచూ యుండవలెను.

అయితే నిజానికి చెప్పుకొనవలెనంటే, అనేకులు విధేయతను గూర్చి గ్రహించుకొనలేక పోవుచున్నారు. విచారకరమైన సంగతి ఏమంటే అనేకులు విధేయతను బోధించలేక పోవుచున్నారు. విధేయత అనునది బైబిలునందు మిక్కిలి ప్రాముఖ్యమైన మాటయై యున్నది. క్రైస్తవ్యములో ప్రజలు వివిధ రకములుగా చీలిపోయినందున విధేయత వారిలోకూడ అత్యవుసరమై యున్నది. మన ప్రభువు కోరుచున్న విధేయతను గ్రహించుకొనలేక కొందరు యేసుక్రీస్తు బోధనే అర్ధము చేసికొనలేక పోవుచున్నామని చెప్పుదురు. ఉదాహరణకు పాపియైన మానవుడు ప్రభువును సంతోష పెట్టవలెనంటే యేమి చేయవలెనో గ్రహించు నిమిత్తము బైబిలులో

బాప్తిస్మము పొందుట అవుసరమని చదువగానే కొందరు పాపక్షమాపణ నిమిత్తమై బాప్తిస్మమును నిరాకరింతురు. దానిని నేను గ్రహించలేక పోవుచున్నా నని వారు చెప్పుదురు. వారు గ్రహించ లేకపోవునది బాప్తిస్మము కాదుగాని విధేయతనే వారు గ్రహించలేక పోవుచున్నారు. విధేయతను గూర్చి గ్రహించినప్పుడు బాప్తిస్మమును గూర్చి గాని, ప్రభురాత్రి భోజనమును గూర్చి గాని, ఆరాధనలో వాయిద్యములను గూర్చి గాని వారికి సమస్యలు ఉండ నేరవు.

**విధేయత బోధింపబడాలి**

విధేయతను గూర్చిన సత్యమును బోధించు బాధ్యత క్రీస్తు సంఘముల పై ఈనాడు ఎక్కువ యున్నది. అనేకులు విశ్వాసమువలన మాత్రమే రక్షణ కలుగునను సిద్ధాంతమును బోధించుచుండుట వలన వారు విధేయతను గూర్చిన సత్యమును బోధించ లేకపోవుచున్నారు. కొందరు వారు చేయుచున్న పనులను బట్టి దేవునికి విధేయత చూపించు చున్నా మనుకొందురు గాని అట్టివి విధేయత కానేరావు.

దేవుని గూర్చి యిష్టమైన మనస్సును కలిగియుండుట విధేయత కాదు. అవును ఒకడు దేవునికి విధేయుడైన యెడల దేవుని గూర్చి సరియైన ఆత్మీయ స్వభావమును కలిగి యుండును. అయితే కొందరు దేవుని గూర్చి యిష్టాన్ని వెలిబుచ్చుదురు గాని ఆయన చిత్తమునకు లోబడుటకు వెనుకాడుదురు. తనకు విధేయులైన వారికే ఆయన రక్షణకర్తయని మనము గమనించవలెను.

దేవుని కేవలము పెదవులతో ఘనపరచుట విధేయత కాదు. మత్తయి 7:21లోను, లూకా 6:46లోను యేసు యేమి చెప్పెనో జ్ఞాపకమున్నదా? కేవలము ప్రభువా, ప్రభువా అని పిలుచుట సరిపోదు అని ఆయన చెప్పెను. తీర్పుదినమున కూడ అనేకులు ప్రభువా, ప్రభువా అని పిలుతురు గాని వారి ముఖస్తుతి

వ్యర్థమని ఆయన చెప్పెను. ఆయన యిట్లనెను: "ఆదినమందు అనేకులు నన్నుచూచి ప్రభువా, ప్రభువా మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్ట లేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను, మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నా యొద్ద నుండి పొండని వారితో చెప్పుదును. (మత్తయి 7:22,23).

మరల, దేవుని చిత్తమును కొంత జరిగించి మరికొంత జరిగించకుండా యున్నట్లయిన అది విధేయత కాదు. మత్తయి 23:23లో ఆనాటి శాస్త్రులు, పరిసయ్యులు పదియవవంతు చెల్లించి ధర్మశాస్త్రము లో ప్రధానమైన విషయములను అనగా న్యాయమును, కనికరమును, విశ్వాస మును విడిచిపెట్టిరి గనుక క్రీస్తు వారిని ఖండించెను. వాటిని మానక వీటిని చేయవలసి యుండెనని ఆయన వారికి చెప్పెను. మనలో అనేకులు అట్లున్నారు. వారు తమ కిష్టము వచ్చిన ఆజ్ఞలను గైకొని, మిగిలిన వాటిని వదలివేతురు. అట్టిది అవిధేయతయే గాని విధేయత కానేరాదు.

## పరిపూర్ణ విధేయత కావాలి

దేవుడు ఆజ్ఞాపించిన దానికి బదులు మరియొక దానిని ఆయన సేవలో ప్రవేశపెట్టుట విధేయత కానేరదు. మొదట సమూయేలు గ్రంథములో సౌలురాజు మనకగుపడు చున్నాడు. అమాలేకీయుల నందరిని, వారి పశువులను బొత్తిగా నాశనము చేయవలెనని దేవుని ఆజ్ఞను పొందియు అతడేమి చేసెను? అతడు వారి రాజును, వారి పశువులలో కొన్నింటిని బ్రదుకనిచ్చి యెహోవా కొరకు బలిగా వాటిని అర్పించనెంచెను. దేవుడతన్ని వెంటనే తిరస్కరించెను. అతని అవిధేయతను ఖండించెను. నేడు అనేకులు ప్రభురాత్రి భోజనమును దేవుడు ఆజ్ఞాపించినప్పుడు గాక తమ కిష్టము వచ్చినప్పుడు ఆచరింతురు, ఆరాధనలో గానసంగీతమును గాక

వాయిద్యముల నుపయోగింతురు. అట్టి వారు కేవలము అవిధేయులే. మనము దేవుని ఆజ్ఞలకు కలుపుటగాని తీసి వేయుటగాని చేయరాదు.

దేవుడు మననుండి పరిపూర్ణ విధేయతను కోరుచున్నారు. మన విధేయతలో ఏమాత్రము తక్కువయినా ఆయన మనలను అంగీకరించరు. అందుకే మనదేవుని పూర్ణహృదయము తోను, పూర్ణమనస్సుతోను, పూర్ణ ఆత్మతోను ప్రేమించవలెనని క్రీస్తు చెప్పెను. దేవుడు నిన్ను నీ సేవను అంగీకరించవలెనని నీవు కోరుచున్న యెడల ఆయన యిచ్చు ప్రాథమిక ఆజ్ఞలకు మొదట లోబడుము. క్రీస్తును నమ్ముకొనుము. నీపాపముల విషయమై మారుమనస్సు నొందుము. క్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనుము. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది సువార్తకు విధేయుడవుకమ్ము. అటు తరువాత నీ మరణ పర్యంతము లేక క్రీస్తు మరల వచ్చు పర్యంతము ఆయునకు విధేయుతకలిగి జీవించుము. అంత్యదినమున ఆయన నిన్ను నిత్య రక్షణలో ప్రవేశింపజేయును.

## తీర్పు నాడు నీవేమి చెబుతావు?

## ( What will you say at the Judgement ? )

భక్తి భావములు గల ప్రతివాడు తీర్పును గూర్చి ఎరిగియున్న వాడే, దేవునితో మానవుడు సమావేశమయ్యే ఈ సంఘటనను గూర్చి బైబిలు విశద ముగా బోధించుచున్నది. యేసు ఈ లోకంలో యున్నప్పుడు రాబోవు తీర్పును గూర్చి బోధించారు.

"మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసియుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పుపొందుదువు. నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పుపొందుదువు" (మత్తయి 12:36,37).

"తండ్రి యెవనికిని తీర్పుతీర్చడు గాని తండ్రిని ఘనపర్చునట్లుగా

అందరు కుమారుని ఘనపరచవలెనని తీర్పుతీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించియున్నాడు" (యోహాను 5:22).

"నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48). అపొస్తులుడైన పౌలు కూడ తీర్పును గూర్చి ఇట్లుచెప్పాడు.

"ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచి, చూడనట్లుగా ఉండెను. ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత భూలోకమునకు తీర్పుతీర్చబోయెడి యొకదినమును నిర్ణయించియున్నాడు. మృతులలో నుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు" (అపో.కా. 17:30,31). "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తున్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:10). "దేవుని యెదుటను సజీవులకును మృతులకును తీర్పు తీర్చు క్రీస్తుయేసు యెదుటను.. నేను అనబెట్టి చెప్పుదేమనగా" (2తిమో.4: 1,2). "మనుష్యులొక్క సారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పుజరుగును" (హెబ్రీ 9:27).

అపొస్తలులైన పేతురు యోహానులు కూడ తీర్పును గూర్చి ఇట్లు హెచ్చరించిరి.

"భక్తులను శోధనలో నుండి తప్పించుటకును.. శిక్షలో ఉంచబడిన వారిని తీర్పుదినము వరకు కావలిలో ఉంచుటకును ప్రభువు సమర్థుడు" (2 పేతరు 2:9).

తీర్పుదినము యొక్క దృశ్యాన్ని

భక్తుడైన యోహాను ఇట్లు వర్ణించాడు.

"మరియు ధవళమైన మహా సింహాసనమును దానియందు ఆసీనుడై యున్న యొకనిని చూచితిని; భూమ్యాకాశములు ఆయన సముఖము నుండి పారిపోయెను; వాటికి నిలువచోటు కనబడకపోయెను. మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము యెదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను; మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను. ఆ గ్రంథముల యందు వ్రాయబడి యున్నవాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి" (ప్రకటన 20:11-13).

## దండన ఉందండోయ్ !

అహరోను కుమారులు
నాదాబు అబీహులు
ధూపార్తులు చేతబట్టి
అన్యాగ్నిని తెచ్చిపెట్టి
దైవాగ్నితో దహనమైరి!

యాజక బోధక వర్గానికి
అప్పుడే చెప్పాడు దేవుడు
ప్రతిష్ఠితములో లౌకికమును
అపవిత్రత నుండి పవిత్రతను
వేరుపరచుటే తమ విధియని !

ఆధునిక బోధకులలో కొందరు
నాదాబు అబీహుల వలెనే నేడు
ప్రతిష్ఠితములో లౌకికమును
పవిత్రతలో అపవిత్రతను,
చేర్చి కూర్చుకుంటున్నారు పాపాన్ని!

సర్వజ్ఞులమనే స్వనీతిపరులు
ప్రజలమనే మెప్పునేకోరు పాస్టరయ్యలు
అధర్మకారులైన ఆచార్యులు
ఆత్మ గద్దింపులను అలక్ష్యం చేసేవాళ్ళు
ప్రచండాగ్ని దండనకు పాత్రులవ్వరా??
(హెబ్రీ 10: 26-31)

- యస్.జె. మేడిది, కొణితివాడ.

# దేవుని ఆలయము

## ( God's Temple )

కొరింధులో యున్న క్రీస్తు సంఘమునుకు పౌలు ఇట్లు చెప్పాడు. "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకారు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" (1 కొరింధీ 6:19,20). కొరింధులోని ప్రజలు ఈ లోకభారములను విడిచి సువార్తకు విధేయులై నిజదేవుని, యేసుక్రీస్తును అంగీకరించిరి. వారు క్రైస్తవులు, క్రీస్తు సంఘస్థులు అయిరి. "మీరు మీ సొత్తుకారు" అని పౌలు వారికి చెప్పాడు. మన దేహము దేవునికే చెందును. ఆయన తన స్వ రక్తముతో మనలను కొన్నారు. మన శరీరాత్మలు ఆయనవే. అందువలన మన దేహముతో దేవుని మహిమ పర్చాలి.

క్రైస్తవుడైన వాడు తన శరీరాన్ని దుర్వినియోగం చేసినా, అపవిత్ర పరచినా అతడు దేవుని ఆత్మ నివసించు ఆలయాన్ని అపవిత్ర పరుచును. "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా? ఎవడైనను దేవుని ఆలయమును పాడు చేసిన యెడల దేవుడు వానిని పాడు చేయును" (1కొరింధీ 3:16,17). మనం దేవుని ఆలయమై యున్నాము గనుక, దేవునితో పాడుచేయబడ కుండు నిమిత్తము మన దేహములను అపవిత్రపరచకూడదు.

పాపమును గూర్చి మత శాఖల వారు వివిధ రీతులగు బోధింతురు. ఆత్మయే పాపం చేయును గాని దేహము కాదని కొందరంటారు. మరి కొందరేమో శరీరమే గాని ఆత్మ పాపము చేయదంటారు. అయితే ఈ సమస్యకు బైబిలే జవాబిచ్చుచున్నది : "పాపము చేయువాడే మరణము నొందును" (The Soul that sinneth, it shall die) అని యెహెజ్కేలు 18:4లో పరిశుద్ధాత్ముడు చెప్పారు. గనుక "శరీర దురాశలకు లోబడు

నట్లుగా చావునకు లోనైన మీ శరీర మందు పాపమును ఏలనియ్యకుడి" యని అపొ.పౌలు చెప్పాడు (రోమా 6:12). మరల శరీరకార్యములు చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని అతడు చెప్పాడు. అవేవనగా, "జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు మత్తతలు, అల్లరితో కూడిన ఆట పాటలు మొదలైనవి" (గలతీ 5: 20,21).మానవుని ఆత్మ పాపము చేయును. ఆ పాపము శరీరముతో చేయును. అందువలనే, "మీ ఆత్మయు, జీవమును శరీరమును మన ప్రభువైన యేసు రాకడయందు నిందా రహితముగాను సంపూర్ణముగాను ఉండు నట్లు కాపాడబడును గాక" యని పౌలు ప్రార్థించాడు (1థెస్స 5:23).

కొందరు పొగత్రాగుచు, వారి దేహములను దేవునికి పవిత్రమైన ఆలయముగా యుంచు చున్నామని తలస్తారు. అయితే "పరిశుద్ధమును దేవునికి అనుకూలమైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనాలని" మనకు చెప్పబడి యున్నది (రోమా 12: 1). క్రైస్తవులైన వారు పొగత్రాగుచు, మద్యపానము వగయిరా చేయుచు తమ శరీరములను పవిత్రముగా ఎట్లుంచు కొనగలరో నేనెరుగను. పొగ త్రాగుట వలన శరీరానికి ఎంత హాని కలుగునో ఏ వైద్యుని అడిగినా చెప్పును. రోగియైన వానికి వైద్యుడవుసరమని యేసు చెప్పారు. సిగరెట్లు తయారు చేసే కంపెనీల వాళ్లే పొగత్రాగుట హానికరమని చెబుతారు. అట్లు ప్రకటి స్తారు. అయినా కోట్లాది ప్రజలు తమ డబ్బిచ్చి హాని కొనితెచ్చు కొనుచున్నారు.

క్రైస్తవులు తమ శరీరములను పవిత్రముగా ఉంచుకోవాలి. ఆత్మ నివసించు గృహమది. మన శరీరాలను పాడుచేసుకొంటే, దేవుడు మనలనే బాధ్యులుగా ఎంచును. అందువలన మన హృదయాలను, దేహములను ఎల్ల వేళలా పవిత్రంగా ఉంచుకోవాలి.

– జాన్ హేరిస

# మనము చూడగలిగితే..

## ( If we could see)

"ఆయనను సిలువవేసినప్పుడు పగలు తొమ్మిది గంటలాయెను" (మార్కు 15:25).

శుక్రవారం ఉదయం 9 గంటలకు యేసును సిలువవేసిరి. ఆ తతంగమంతా జరిగించుటకు పెద్ద సమయం పట్టదు. ఆ పని జరిగించిన వారు అందులో నిపుణులు. ఆ కార్యక్రమం అంతావారెరిగిన వారే. ఇంతకుముందు అనేకులను వారు సిలువ వేసి యుండిరి.

వారి పని అంతా అయిపోయి నప్పుడాసైనికులు కుట్లు లేని ఒక అంగీకొరకు చీటీలు వేసికొనుచు కాలము గడుపుచుండిరి. అంతకు మించి సిలువవేయబడిన వ్యక్తి చనిపోయే వరకు అక్కడ కూర్చొని కని పెట్టుటయే వారి పని.

అదే సమయంలో ఒక గొప్ప సంగతి జరుగుచుయున్నది. గాని గొల్గొతాలో యున్న వారికి మాత్రము ఏమీ తెలియదు.

రోమీయుల విషయంలో యిది సత్యము. ప్రపంచాన్ని మార్చే ఈ సంఘటనలో వారు పోషించుచున్న పాత్ర విషయమై వారికి యేమీ ఎరుకలేదు. దేవుడే మానవుడని వారు ఊహించుకోలేరు, ఆయన నిస్వార్థము గా ప్రవర్తించడం వారికన్నలు తెలియదు. మెస్సీయను గూర్చి వారి కొక అభిప్రాయమున్నది. వారికి రక్షకుడవుసరమని వారికి తెలుసు. గాని వారు చేసింది తెలియక చేసారు. గనుక యేసు వారి కొరకు ప్రార్థించారు.

యూదులు గజిబిజికాకూడదు గాని వారు కూడ రోమీయులవలె సందిగ్ధంలో పడ్డారు. లేఖనములు వారి యొద్దఉన్నా, అనేక ప్రవచనములను వారెరిగియున్నా మెస్సీయను గూర్చి వారికున్న అభిప్రాయములు చిందర వందరమయ్యాయి. దేవుడే మానవుడవుతాడని వారు ఊహించుకో లేకపోయారు. ఆయన బాధనొందు సేవకుడని తెలుసుకోలేకపోయారు. వారు

మెస్సీయను కనుగొనినను ఆయన యేసువలె యుండడు. గనుక వారు చేసినది తెలియకచేసారు. యేసు వారి కొరకు ప్రార్థించారు.

ఆశ్చర్యం! ఆయనను సిలువ వేయుచున్న వారిని గూర్చి యేసు ప్రార్థించారు. ఆయన చనిపోతే వారికేమీ? వారిపని వారు చేసుకొంటూ పోయారు. యేసు ప్రార్థించారు, వారు చీట్లు వేసు కొన్నారు.

సిగ్గుచేటు! అది అచ్చం మనలాగే యున్నది. అత్యంత విలువైన వాటిని చూచుటకు సృష్టింపబడి యుండగా పనికిమాలిన సంగతులను మనం తరచు దృష్టించుచు యుంటాము. దేవుని యొక్క నిత్య ఆశీర్వాదములను స్వతంత్రించు కొనుటకు చేయబడగా, ఈలోక తాత్కాలిక సంగతులను వెంటాడుచు యుంటాము. దేవుని వలెయుండుటకు ఆయనచే సృష్టింపబడగా, పనికిమాలిన వ్యాపారములలో కాలాన్ని వెళ్లబుచ్చుచు యుంటాము. అత్యంత స్వల్పపనులలో మిళితమైపోయి, మనచుట్టూ జరుగు చున్న దేవుని క్రియలను గుర్తించ కున్నాము.

ఈలోకంలో మున్నెన్నడు జీవించని గొప్ప మనుష్యునికి కొన్ని అడుగుల దూరములోనే ఈ సైనికులున్నారు. గాని వారి ధ్యాస అంతా ఆయన అంగీపైనే యున్నది. ఈలోకం రక్షింపబడుచు యుండగా వారు తమ నాణెములతో జూదమాడు చున్నారు.

వారాయనను చంపినంత మాత్రాన సరిపోలేదు. నిజానికి వారాయనను చూడనేలేదు.

వారికంటే మనకు బాగా తెలిసినా, అదే పొరబాటు మనం చేయడం చాలా సులువే. పనుల తొందర, లక్ష్యము లేకపోవడం, ఒడిదుడుకులు, స్వార్థ కాంక్షలు మొదలగునవి ఆయన నుండి మనలను దూరంచేస్తాయి. మనం ఆయనను చూచునట్లు యేసు ఈలోకానికి వచ్చారు. మనం ఆయనను చూడగలిగితే...!

- మైక్ ఐర్లండ్

# పాత నిబంధన నేల చదువ వలెను ?

## ( Why Study the old Testament ?)

అపొ.పౌలు విశ్వాసమును బట్టి తన కుమారుడని యెంచిన యౌవన సువార్తికుడగు తిమోతికి ఈలాగున వ్రాసాడు. "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము" (2తిమో 2:15). ఇదే హెచ్చరికను ఈనాడు మనం కూడా వినాలి. దేవుని వలన మెప్పు పొందేలాగ మనం మెలగాలి. అట్లు చేస్తే దేవుని యెదుట యోగ్యునిగాను మన పనిలో సిగ్గుపడ నక్కరలేనివాని గాను మనం తయారగుదుము. అయితే మనం దేవుని సంతోషపరచాలంటే యేమి చేయాలో, ఆయన మననుండి యేమి కోరుచున్నారో తెలిసికోవాలంటే మనం ఆయన వాక్యాన్ని దీర్ఘంగా చదువుచూ ధ్యానిస్తూ యుండాలి.

క్రైస్తవులవలె మనం క్రొత్త నిబంధన యొక్క ప్రాముఖ్యతను ఎరుగకుండా యుండలేము. తత్ఫలితంగా మన బైబిలు పఠనమంతా క్రొత్త నిబంధనమీదే ఆధారపడి యున్నట్లగుపడుచున్నది. విచారకరమైన సంగతి యేమంటే మనలో చాలమంది పాతనిబంధనను యెరుగకున్నారు. దానిలోని వ్యక్తులను గూర్చి చారిత్రక సంఘటనలను గూర్చి కొంత మట్టుకు మాత్రమే ఎరిగి యున్నాము.

క్రొత్త నిబంధన పఠనము యొక్క ప్రాముఖ్యత గొప్పదే. ఈ అంత్య దినాల్లో మనం కృపవలన కలిగిన నిబంధన క్రింద యున్నాము. యేసు క్రీస్తునందలి విశ్వాసము ద్వారా మనం రక్షణ పొందగల్గుచున్నాము గాని మోషే యుగంనాటి ధర్మశాస్త్ర పద్ధతుల ననుసరించి కాదు (ఎఫెసీ 2:1-11; యోహాను 1:17). మానవునికి దేవుని పరిపూర్ణమైన అంతిమ బయాల్పాటే

క్రొత్తనిబంధన. అందుకే అపో.పౌలు ఇట్లు చెప్పాడు : "క్షేమము మీకు ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమైనను పరలోకము నుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక. మేమిదివరకు చెప్పిన ప్రకారమిప్పుడును మరల చెప్పుచున్నాము : మీరు అంగీకరించిన సువార్త గాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడవును గాక" (గలతీ 1:8,9). అది పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ (యూదా:3).

క్రొత్త నిబంధన యొక్క ప్రాముఖ్యతను గూర్చి చెప్పుచు మనం పాతనిబంధన యొక్క పఠనాన్ని నిర్లక్ష్యం చేయుచున్నాము. అందువలన దేవుని చిత్తము యొక్క బయల్పాటు లోని సౌందర్యాన్ని మాధుర్యాన్ని మనం తెలిసికోలేకపోవుచున్నాము. పాత క్రొత్త నిబంధనల సరియైన సంబంధాన్ని తెలిసికోలేకపోవుటవలన ఇది జరుగుచున్నది. దేవుని చిత్తం అంతటిలో ఈ రెండూ ప్రాముఖ్యమే.

లేఖనములన్నియు దైవావేశము వలన కలిగినవే. ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి (2 పేతురు 1:21). క్రీస్తుయేసు నందుంచ వలసిన విశ్వాసము ద్వారా రక్షణార్థమైన జ్ఞానము కలిగించే శక్తి లేఖనముల యందున్నదని చెప్పబడింది (2తిమోతి 3:14). మరియు ఈ సత్యవాక్యాన్ని సరిగా విభజించిన యెడల దేవుని యెదుట యోగ్యునిగా కనబడే తరుణం మనకు దొరుకునని గమనించాం. ఈ వచనాలన్నీ బైబిలు యొక్క విలువను మనకు తెలియజేయుచున్నను, ప్రాథమికంగా వాటిలో చెప్పబడిన లేఖనములు పాతనిబంధన లేఖనములని మనం తెలిసికోవాలి. అందువలన పాతనిబంధనను చదువుట మనం నిర్లక్ష్యం చేయరాదు.

## మనకు బోధ కలుగును

పాతనిబంధనవలన మనకు బోధ కలుగు నిమిత్తము అది వ్రాయబడింది. "ఏలయనగా ఓర్పువలనను లేఖనములవలన, ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధకలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి" (రోమా 15:4). దేవుడు మానవుని సృష్టించిన నాటి నుండి మొదలుకొని ఇశ్రాయేలీయులు బబులోను బానిసత్వము నుండి విడుదల పొందువరకుయున్న చరిత్రాత్మక రికార్డు అది. అది హెచ్చరించడానికి, గద్దించడానికి, బోధించడానికి ప్రయోజనకారియై యున్నది. తిరుగుబాటును గూర్చి అవిధేయతను గూర్చి మనలను అది హెచ్చరించుచున్నది (1 కొరింధి 10:1-13). దేవునికి నమ్మకంగా సేవ చేయుటకది ప్రోత్సాహించుచున్నది. "ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించి యున్నందున మనము కూడ ప్రతి భారమును సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము" (హెబ్రీ 12:1,2). క్రొత్త నిబంధనలోయున్న దేవుడే పాత నిబంధనలోయున్న దేవుడు. ఆయన తన ప్రజల నుండి ఎల్లప్పుడూ విశ్వాసము విధేయతలనే కోరారు. ఆయా సందర్భాలు, స్థలాలు మారవచ్చు గాని ఆయన యొక్క సూత్రాలు మాత్రం మారనివి.

## క్రొత్త నిబంధన అర్థం చేసుకోగలం

ఇంకా, పాతనిబంధనను మనం చదివేకొలదీ క్రొత్త నిబంధనను అర్థం చేసుకోడానికి వీలవుతాది. క్రొత్త నిబంధన యొక్క మూలం అంతా ఎక్కువ పాతనిబంధనలోనే వున్నది. పాత నిబంధనలోని వచనాలు, సందర్భాలు క్రొత్త నిబంధనలలో 650 సార్లు కంటె ఎక్కువ ఎత్తి చూపించబడినవి. పాతనిబంధనను కొంత

వరకైనా ఎరగకుండా క్రొత్తనిబంధనను మనం అర్థం చేసుకొనలేము. పాత నిబంధనను మనం అర్థం చేసుకొనే కొలదీ క్రొత్త నిబంధనను అర్థం చేసుకోగలం.

## చారిత్రక వాస్తవములు

చరిత్రలోని వాస్తవాలను మనకు పాత నిబంధన అందజేయుచున్నది. గనుక దాన్ని మనం చదవాలి. చరిత్రాత్మక విషయాల్లో పాతనిబంధన సమ్మతగినదని, యథార్థమైనదని యేసే మనకు తెలియజేసారు. (మత్తయి 19:4; 22:29). దేవుని యొక్క ఉనికిని గూర్చి సృష్టినిగూర్చి, మానవుని ఆరంభాన్ని గూర్చి, జలప్రళయాన్ని గూర్చి మొదలైన అట్టివాటిని గూర్చి మనకు ఖచ్చితమైన సమాచారం ఇంకెక్కడ దొరకును? వీటిని గూర్చి అక్కడక్కడా మనకు కొంత సమాచారం దొరుకుతుంది గాని అది అంత నమ్మ తగినది, అధికార యుక్తమైనదికాదు. పాతనిబంధన యథార్థమైనది మాత్రమే కాదు గాని అది అధికార యుక్తమైనది. ఆత్మావేశముచే లిఖింపబడిన సత్యమని నిరూపించుకొన్నది.

పాత నిబంధన ఈలోకరక్షకుడగు యేసుక్రీస్తును సూచించుచున్నందున ముఖ్యంగా దాన్ని మనం పఠనం చేయాలి. మోషే ధర్మశాస్త్రాన్ని నిత్యము ఉండేదిలా దేవుడు ఉద్దేశించలేదని పాతనిబంధన విపులంగా బయలు పరుచుచున్నది. "ఇదిగో నేను ఇశ్రాయేలు వారితోను యూదా వారితోను క్రొత్త నిబంధనచేయు దినములు వచ్చుచున్నవి" యని ఆయన చెప్పారు (యిర్మియా 31:31-34). మోషేధర్మ శాస్త్రము ఒక ప్రత్యేక ప్రయోజనం కొరకు తాత్కాలికంగా ఉద్దేశించబడినదని అపో. పౌలు చెప్పాడు. ఆ ప్రయోజనం నెరవేరిన తరువాత దాని అవుసరత ఇక లేకపోవును (గలతీ 3:10-25).

మెస్సీయను గూర్చి ఆయన రాజ్యాన్ని గూర్చి పాతనిబంధనలో 400 కంటే పైగా ప్రవచనములున్నవి. అంతే గాకుండా దానిలోని కొన్ని

సందర్భములు, వ్యక్తులు, సంస్థలు క్రీస్తుకు మాదిరిగాను, రాబోవు సంగతుల ఛాయగానుయున్నవి. "లేఖనములయందు మీకు నిత్య జీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుడి. అవే నన్ను గూర్చి సాక్ష్య మిచ్చుచున్నవి'' యని యేసుప్రభువు చెప్పారు (యోహాను 5:39).

వీటన్నిటిబట్టి పాతనిబంధనను చదువుట అవుసరం అని మనం గ్రహించుకోగలము. మనము పాత నిబంధనకు బద్ధులము కాకపోయినను దాన్ని చదువుట అత్యవసరం. క్రీస్తు ప్రభువును, ఆయన రక్షణమార్గాన్ని ఆయన సంఘాన్ని మరింత అర్థం చేసుకోవాలంటే పాతనిబంధన లేఖనాలను చదువుట అవుసరం. "కావున మనము వినిని సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగి యుందము' (హెబ్రీ 2:1).

– జాషువా గూటం

# ఎస్తేరు
## ( Esther )

ప్రతియుగంలోను అసాధారణ మైన వ్యక్తులుంటారు. ఎస్తేరు ఒక అసాధారణమైన వ్యక్తి. పర్షియా దేశపు రాణి కాకముందు తన జీవితంలో ఆమె కనీసం నాలుగు ప్రతికూల సంగతుల నెదుర్కొనవలసి వచ్చినది.

మొదటిగా, తన బాల్యదశలోనే తల్లిదండ్రులను ఆమె కోల్పోయినది.

ఒక బాలిక తన జీవితంలో తలిదండ్రు లను కోల్పోవుట గొప్ప దుర్ఘటన. తన బంధువైన మొర్దెకై యొక్క ప్రేమకు ఆమె కృతజ్ఞత కలిగి యుండినను, తలిదండ్రు లతో పెంచబడుట కంటే మించిన సంతోషం మరొకటి లేదు.

**రెండవది, ఆమె దేవతార్చన చేయు వాతావరణములో పెరగవలసి వచ్చినది.**

తన పూర్వీకులు విగ్రహారాధన చేయుట వలన దేవుడు యూదా దేశము మీదికి బబులోను ద్వారా తన తీర్పును రప్పించెను. వారిని తదుపరి పర్షియా దేశము ఓడించెను. హామాను చేసిన దుష్ట తలంపులను గూర్చి రాజైన అహష్వేరోషు యొక్క స్పందనను బట్టి ఆ రాజ్యము యొక్క దేవతార్చన తత్వాన్ని మనం గ్రహించవచ్చును. హామాను యూదులను హతమార్చుటకు సంకల్పించగా రాజు అతనితో, "నీ దృష్టికి ఏది అనుకూలమో అది ఆ జనులకు చేయునట్లుగా వారును నీకు అప్పగింపబడియున్నారని" చెప్పెను (ఎస్తేరు 3:11). వెంటనే, "యౌవనుల నేమి వృద్ధులనేమి, శిశువులనేమి, స్త్రీల నేమి యూదలనందరిని ఒక్కదినమందే బొత్తిగా నిర్మూలము చేయుటకు రాజ్య సంస్థానము లన్నిటికీ తాకీదులు పంప బడెను" (ఎస్తేరు 3:13). "అంతట రాజును హామానును విందుకు కూర్చుండిరి" (ఎస్తేరు 3:15).

**మూడవదిగా ఆమె జీవితం సాధారణంగా నడువలేదు.**

యూదుల లోని ప్రతి స్త్రీ యొక్క ముఖ్య గమ్యము - వివాహము, కుటుంబము మరియు తన స్వంత గృహము. ఎస్తేరు వీటిని గూర్చి తప్పక కలలు కనియే యుండును. గాని ఆమె రాజు యొక్క కోటలోని అంత:పురమునకు చేర్చ బడెను. దేవతార్చన చేయు కోటలలో రాజుకు ఇష్టములేని స్త్రీలు ఏకాంత జీవితం జీవిస్తారు. అది వారికి అసాధారణం కాదు. రాణియైన తరువాత కూడ తాను "నేటికి ముప్పది దినముల నుండి రాజునొద్దకు ప్రవేశించుటకు పిలువబడలేదని" మొర్దెకైతో చెప్పెను (ఎస్తేరు 4:1).

**నాల్గవదిగా, తన కన్యాత్వమును విగ్రహారాధన చేయు రాజుకు అప్పగించుటకు ఆమె బలవంతము చేయబడెను.**

ఎస్తేరు లాంటి యువతులకు కన్యాత్వమే గొప్పప్రశస్తమైన సంపద. తన యిష్టప్రకారము వివాహమాడిన పురుషుని కొరకు ఆమె దానిని భద్రముగా కాపాడుకొనును. గాని ఆమె తన యింటి నుండి కొనిపోబడి అహష్వేరోషుకు తానొక వస్తువువలె సమర్పించబడెను. ఆమె అతనిని ఎన్నడు చూడలేదు, ప్రేమించలేదు. అతని గూర్చి ఏ విధమైన భావములు ఆమెకు లేవు.

గాని ఎస్తేరు ఆనాటి ప్రపంచములో గొప్ప శక్తివంతమైన దేశపు రాణి ఆయెను. అనేక శోధనల నెదుర్కొనెను. అహష్వేరోషు తన రాజ్యములో సగము మట్టుకు అమెకు యిచ్చుటకు సంసిద్ధుడాయెను (ఎస్తేరు 5:3). హామాను మరణించిన తరువాత అతని సంపద అంతయు ఆమెకు ఇయ్యబడెను (ఎస్తేరు 8:1). ఈ రీతిగ ఎస్తేరు అనుదినం గొప్ప నాశనకరమైన శక్తులతో జీవించవలసి వచ్చెను. రాజకీయ శక్తి, విస్తారమైన సంపద, గొప్ప లౌకిక ప్రఖ్యాతి. వీటి వలన నాశనమొందిన వారు కోకొల్లలు. అయితే వీటికి భిన్నముగా ఎస్తేరు యొక్క ప్రవర్తనను గమనించుము.

**మొదటిగా, ఆమె సౌమ్యమైనట్టియు, విధేయత కలిగినట్టియు స్వభావమును ప్రదర్శించెను.**

షూషను అంతఃపురములో సౌందర్యవంతులైన యువతులు చేర్చబడిరి, ఆ కన్యకలలో ఏదేని యందు రాజు యిష్టపడునో ఆమె ఆదేశపు రాణి యగును. వారిలో చాల మంది సంపన్నుల గృహముల నుండి వచ్చి యుందురు. స్వార్థపరులు, గర్విష్ఠులు కావచ్చును. అంతఃపురములో నుండి రాజు ఇంటిలోనికి వెళ్లవలసిన సమయమందు ఒక్కొక్క స్త్రీ యేమేమి కోరునో అది ఆమెకియ్యబడెను (ఎస్తే 2:13). అయితే ఎస్తేరు రాజునొద్దకు వెళ్లవలసిన వంతు వచ్చినప్పుడు స్త్రీలను కాయు రాజు యొక్క షండుడైన హేగే నిర్ణయించిన అలంకారము గాక ఆమె మరి ఏమియు కోరలేదు (2:15).

**రెండవదిగా, ఆమె వ్యక్తిత్వము అపూరూపమైనది.**

"ఎస్తేరును చూచిన వారందరికి ఆమె యందు దయ పుట్టెను" (2:15). దైవానుగ్రహమా? అవును.

**మూడవదిగా, ఆమె గౌరప్రద మైన విధేయతను కనుబరచెను.**

రాణి గా ఆమెకు కిరీటము ధరింపబడినను "ఎస్తేరు మొర్దెకై యొక్క పోషణ మందున్న కాలమున చేసినట్టుగానే ఇప్పుడును అతని మాటకు లోబడు చుండెను" (2:20). ఆమె పర్షియా దేశపు మహారాణి! ఆమె శక్తి వంతమైనది, సంపదగలది, ప్రఖ్యాతి గాంచినది. ఆమె మొర్దెకైను మరచి పోవుట చాలా సులభం, అతనిని చిన్న చూపు చూడవచ్చును. గాని ఎస్తేరు అట్లు చేయలేదు.

**నాల్గవదిగా, తన ప్రజల నిమిత్తము ఆమె తన ప్రాణమును సహితము కోల్పోవుటకు సంసిద్ధురాలా యెను.**

"నేను రాజు నొద్దకు ప్రవేశించు దును; నేను నశించిన నశించెదను" అని ఆమె చెప్పెను. ఏలయనగా రాజు నొద్దకు పిలువబడకుండా ప్రవేశించుట చట్టవిరుద్ధము (4:16). ఆమె తన శక్తిని, స్థానమును, సంపదను, ప్రఖ్యాతిని చివరకు తన ప్రాణమును సయితము త్యాగము చేయుటకు సిద్ధ పడెను.

ఒక వ్యక్తి జీవిత విషాదముల నుండి, దేవతార్చన నుండి లేచి గొప్ప విపత్తుల నెదుర్కొని, ఈ లోకమునకు ఆశీర్వాదకారకురాలు కాగలదనుటకు ఎస్తేరు సజీవసాక్షి!

– ఫ్రేంక్ చెస్సర్

## సంక్షిప్త వార్తలు

2019 ఫిబ్రవరి నెలలో కాకినాడ సత్యవాణి క్రీస్తుసంఘము ద్వారా నిర్వహించబడుచున్న అనేక సువార్త కార్యక్రమములు సక్రమముగాను, విజయవంతముగాను జరిగినవి. పలు ప్రాంతములలోను, గృహకూడికలలోను, స్థానిక సహోదరులు చురుకుగా పాల్గొని సత్యవాక్యమును వెదజల్లిరి.

2019 ఫిబ్రవరి 10 – 11వ తేదీ రాత్రి స్థానిక సంఘసభ్యుడు సోదరులు నీలపల్లి సూర్యనారాయణ గారు ప్రభువునందు నిద్రించగా 21వ తేదీ గురువారం వారి యింటివద్ద ఆదరణ కూటము జరిగినది. స్థానిక సంఘసభ్యులు అనేకులు హాజరై శోకములోయున్న కుటుంబమును ఆదరించిరి. జరిగిన కూటములో సోదరులు ఎస్.యేసురత్నం, జాషువా గూటం గార్లు వాక్యపరిచర్యచేసిరి.

2019 ఫిబ్రవరి 15వ తేదీన రిక్కీగూటం గారు సువార్త పరిచర్య నిమిత్తము మద్రాసు పయనమై వెళ్లిరి. మరునాడు అమెరికా దేశము నుండి వచ్చిన నలుగురు సువార్తికులతో కలసి 17వ తేదీనాడు మద్రాసులో కొరుక్కుపేటలో యున్న క్రీస్తు సంఘములో వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరలు వి.రాజు గారు పలు సంవత్సరముల నుండి క్రీస్తు కొరకు గొప్ప పనిచేయు చున్నారు. అక్కడ సువిశాలమైన మందిరము నిర్మాణములో యున్నదను సంగతి చదువరులకు విదితమే. తదుపరి జి.జె.ప్రభుదాసు గారి దగ్గర కూడ కూటము జరిగెను.

18వ తేదీన నెల్లూరులో రత్తయ్యగారి దగ్గర జరిగిన కూటములో సోదరులు వాక్యపరిచర్య చేసిరి. 19వ తేదీన ప్రకాశం జిల్లా కందుకూరులో దినమంతా జరిగిన కూటములో సహోదరులు పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. అక్కడ కె. రాజేంద్రప్రసాద్ గారు పలుసంవత్సరముల నుండి సువార్త చాటుచున్నారు. 19వ తేదీ రాత్రకి ఒంగోలులో జరిగిన కూటములో సోదరులు వాక్యపరిచర్య చేసిరి.

2019 ఫిబ్రవరి 20వ తేదీనాడు ప్రకాశం జిల్లా పొదిలి పట్టణములో సోదరులు దినమంతయు ఇంచుమించు గడిపి వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు హెబ్రీపాల్ గారు అనేక సంవత్సరములుగా ప్రభువు కొరకు నిర్విరామ కృషి చేసిరి. చెన్నై, నెల్లూరు, కందుకూరు, పొదిలి ప్రాంతములను సందర్శించి రిక్కీగారును, మరోనలుగురు విదేశీసోదరులును 21వ తేదీ అర్ధరాత్రి తరువాత కాకినాడ చేరుకొనిరి.

2019 ఫిబ్రవరి 22వ తేదీ శుక్రవారం కాకినాడ తిమ్మాపురంలో సోదరులు బి. విజయ్‌కుమార్ గారి దగ్గర జరిగిన కూటములో అమెరికా సోదరులు, రిక్కీ, రోనీ గూటం గార్లు పాల్గొనిరి. మరియు 24వ తేదీ ఆదివారం పై విదేశీసోదరులు హైదరాబాద్‌లో మియాపూర్‌లో యున్న సంఘముతో గడిపిరి. రిక్కీగారు కూడ వారితో యుండిరి. 24వ తేదీ రాత్రి వారికి విమానాశ్రయం యొద్ద వీడ్కోలు పలికిరి.

2019 ఫిబ్రవరి 23వ తేదీ నాడు కాకినాడ క్రీస్తుసంఘ ఆవరణములో సువార్తికులకు ప్రత్యేక సదస్సు జరిగెను. అనేక జిల్లాలనుండి, పట్టణముల నుండి సహోదరులు హాజరైరి. వారినుద్దేశించి రిక్కీగారు, రోనిగూటం గారు మరియు అమెరికా సహోదరులును ప్రోత్సాహకరమైన వాక్యసంటేశము లనందించిరి. కాకినాడ కేంద్రముగా జరుగుతున్న పలుసువార్త పరిచర్యలను బట్టి విదేశీసోదరులు రిక్కీగారిని, రోనిగారిని, రాబిన్‌గారిని అభినందించిరి. పలు జిల్లాల నుండి హాజరైన సహోదరులందరు సంతోషముతో తమ తమ స్వస్థలము లకు బయలు వెళ్లిరి.

**RNI Regd. No. 69973/98**

**Postal Regd. No. AP/KD-02/2018-20**

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.